# ముళ్ళ పొదల మధ్య మల్లె పువ్వు



ఆకొండి వెంకట రత్నం

రహదారికి విడాకులిచ్చిన 'ముఖారివారి వీధి' తూర్పుగా, కుడిచేతి వెంపు తిరిగి, ముణికిపేటలుగుండా అలా అలా వెళ్ళి సినిమా హాలు దగ్గర అంతమై పోతుంది. ఆ వీధిమొగలో ఒక వారగా తూర్పుముఖంగా ఆంజనేయస్వామి కోవెల ఒకటి వుంది. ఎత్తుగా మెట్లు — ఊచలతో ముందు వరండా—వెనుక, నాలుగు గోడలతో గర్భగుడి—పైన, గోడలు లేని డాబావంటి గోపురం—ఇది ఆ గుడి బాహ్య రూపం. గర్భగుడిలో, నిలబడి నమస్కరిస్తున్న హనుమంతుల వారి పాలరాతి విగ్రహం దాదాపు పేదికొనవరకూ కనిపిస్తుంది.

పూర్వం ఎప్పుడో ఒక పెద్ద కోతి ఆ ఊర్లో తిరుగుతూ వుండేదిట. ప్రజలకి అది చాలా హానిచేస్తున్నప్పటికీ అదంటే అందరికీ అభిమానమట. ఆ కోతినీ, ఆ కోతి పొందుతున్న అభిమానాన్నీ సహించలేని ఆ ఊర్లో ఉన్న ఒక ఇంగ్లాండ్ దొరగారు ఒకరోజున తన తుపాకికి పని చెప్పారట. ప్రజలు, 'పాపం' అంటూ కడవల కొద్దీ కన్నీళ్ళు కార్చి, ఆ కోతిని చనిపోయిన స్థలంలోనే సమాధి చేశారట. రాజావారు సమ్మతించరేమోనన్న భయంచేత రాత్రికి రాత్రే దేవతల్ని తలతన్నేలాగ గుడి నిర్మాణం పూర్తిచేశారట. మరి కొన్నాళ్ళకి పాలరాతి విగ్రహాన్నికూడా ప్రతిష్ఠించారట. నిత్యం దర్శనం చేసుకుంటూ ఆనాటి ప్రజలు తమ భక్తినీ, అభిమానాన్నీ చాటుకున్నారుట! ఇదీ క్లుప్తంగా ఆ గుడి తాలూకు గత చరిత్ర. ఇప్పటికీ గుడిలో దీపధూపనైవేద్యాలు సాగుతూనే వున్నాయి. ఇప్పుడు పూజారి నిత్యం ఉండకపోవడంచేత భక్తులు చిక్కిపోయారు.

ఆ గుడిమెట్లే చలమయ్యకి పాలరాతి భవనం. చలమయ్య, చిక్కిపోయిన హనుమంతులవారికి ప్రతిరూపంలా వుంటాడు. పొడవైన మూర్తి, పొట్టిగా చిన్నముక్కు. లోతైన కళ్ళు, పీక్కుపోయిన దవడలు, నుదిటిని కప్పేసే ఉంపిరిజుట్టు; చామనచాయగా ఉండే శరీరం, భుజంమీద చిరిగిపోయిన తుండు, మోకాళ్ళదాకా తోలులాటి పంచె. చిన్నపిల్లలు ఈ ఆకారాన్ని చూడ్డానికి భయపడుతూ వుంటారు.

చలమయ్య గొప్పవాడేంకాదు కాని అతని చరిత్రలో గొప్పతనం వుంది. అందుకే

ఈ కథ ఊపిరి పోసుకుంది.

ఉదయాన్నే లేస్తాడు చలమయ్య. కాల కృత్యాలు తీర్చుకొని, రెండు అరటి పళ్ళు కొని గుళ్లోయిస్తాడు ప్రక్కనే వున్న సూర్యకాంతం బడ్డీ హోటల్లో టీ తాగుతాడు. కర్ర, జోలి చేత్తో పుచ్చుకొని వీధుల వెంట బయలుదేరుతాడు. ఇళ్లన్నీ తిరుగుతాడు. బియ్యం, డబ్బులు, అన్నం— ఏది దొరికితే అది పుచ్చుకుంటాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యేసరికి తిన్నగా గుడిదగ్గిరికి వచ్చేస్తాడు. తెచ్చుకున్న అన్నం, గుడిప్రక్కనే ఉన్న రావిచెట్టు కింద కూచుని తింటాడు. ఆపైన మరెక్కడికీ వెళ్లడు. మోకాళ్ల మీద గడ్డం ఆన్చుకుని గుడిమెట్లమీద చీకటిపడేవరకూ కూచుంటాడు. అప్పుడు అతనిలో ఏ ఆలోచన యుంటాదో తెలియదు. సూర్యకాంతం హోటలు మూసేసే ముందు మళ్లీ కాస్త టీ తాగివచ్చి మెట్ల మీద నిద్రపోతాడు. వర్షం పడితేమాత్రం ఏ ఫకీరు అరుగుమీదికో చేరతాడు. అతను ఎవ్వరికీ అడ్డురావడంలేదు గనక ఎవ్వరూ అతన్ని గుడిమెట్లు ఖాళీ చెయ్యమనలేదు.

ఒకప్పుడు బాగానే బతికి, ఇప్పుడు కూడా కూతురూ, అల్లుడూ, మనుమలూ ఉండి కూడా తాను బిచ్చమెత్తుకోవలసి వచ్చినందుకు చలమయ్య ఎప్పుడైనా విచారిస్తూ వుంటాడు. అల్లుడు తనని ఆదరించకపోవడం అల్లుడి తప్పు కాదు. అల్లుడి కడుపులో స్థిరనివాసమేర్పరచుకున్న ఘనమైన కాపుసారాది తప్పు— అని చలమయ్యకి తెలుసు.

అల్లుడు, కూతురు ఇప్పుడు ఏ వూళ్లో వుంటున్నారో కూడా చలమయ్యకి తెలియదు.

శరీరంలో శక్తి ఉన్ననాళ్లూ గౌరవంగా కూలిపని చేసుకు బతికాడు చలమయ్య. ఇప్పుడు అడుక్కుంటున్నందుకు అతను కించపడడంలేదు. పరిస్థితులకి దాసుడు.

తన వృత్తిలో చలమయ్యకి కొన్ని చిత్రమైన నియమాలున్నాయి. ఆ నియమాల్లో ఒక విచిత్రమైన నీతి వుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలవరకూ ఎంత దొరికితే అంతే— ఆపైన అతను ఎవ్వరినీ ఏదీ యాచించడు. డబ్బులుంటే మొలలో దాచుకుంటాడు. బియ్యం— వండుకుంటాడు అన్నం — తింటాడు. మిగిలింది ఏ ప్రాణికో పెడతాడు. బియ్యం ఎక్కువగావుంటే సూర్యకాంతం దగ్గిర దాచుకుంటాడు. తనకంటే బీదవాళ్లకి ఏదో సహాయం చేస్తూంటాడు. ఉదయం టీ, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ—ఇవే అతని జీవనాధారాలు. బతకడం కోసం తినాలనే తత్వంగల మనిషి.

చలమయ్యకి పరిచయస్తులు కూడా ఆ చుట్టుపట్ల ఇద్దరుముగ్గురు తప్ప ఎక్కువగా ఎవరూ లేరు.

గుడి సమీపంలో కుడిచేతి వెంపునా ఆశ్రమం వుంది. పూర్వం అందులో ఎవరో స్వాములవారు ఉండేవారుట. ఆయన ఒకరోజున తమ దర్శనార్థం ఒంటరిగా వచ్చిన, యౌవనంలో వున్న విశ్వస్తని బలాత్కరించడంవల్ల పెద్ద గడబిడ జరిగిందిట. ఆరోజున ఆయనకు ఆశ్రమంలో స్థానమూ దూరంగా జరిగిందిట. ఆ తరువాత ఆశ్రమంలోకి ఏ స్వాములవారూ దిగలేదు. కాని ప్రస్తుతం, 'తాతయ్యమూర్తి' యాజమాన్యంలో ఆశ్రమం నడుస్తూంది. అతనే యిప్పుడు ఆశ్రమానికి స్వామి.

తాతయ్యమూర్తి, ఆశ్రమం అరుగుల్ని కొట్లుగా మార్చి అద్దెకిచ్చాడు. ఒక కొట్లో ఫకీరు కుట్టుమిషన్లు— మరో దాంట్లో, వెల్లుల్లిపాయ అని పిలవబడే షావుకారు కిరాణాకొట్టు— ఇంకొకదాంట్లో బియ్యం దుకాణం బ్రహ్మయ్య— మరొకటి అప్పలస్వామి కిళ్లీకొట్టు ... ఆశ్రమం కళకళ్లాడుతూంది.

ఈ దుకాణదారులూ, తాతయ్యమూర్తి కాక రావిచెట్టు, గుడిమెట్లు, గుడి వెనకనే ఉన్న చిన్న ఖాళీస్థలం—చలమయ్య సాన్నిహిత్యాన్ని సంపాదించుకున్నాయి.

తాతయ్యమూర్తి, ఆకారానికి మటుకు విలకమర్తివారి గణపతిలా వుంటాడు. తరుచు ఆశ్రమం అరుగుమీదనే వుంటాడు. గ్లాస్కోపంచె, లాల్చీ—తన ఔన్నత్యాన్ని చాటలేక పోతున్నందుకు కించిత్తు కూడా విచారించకుండా, ఆ పనికి స్వంత కంఠాన్నే పురమాయించి ధారావాహికంగా ప్రసంగిస్తూ మురిసిపోతూ వుంటాడు తాతయ్యమూర్తి. చలమయ్య జీవితాన్ని చూసి ఈర్ష్యపడడంవల్ల తాతయ్యమూర్తి గొప్పతనాన్ని చాలా తేలిగ్గా గ్రహించవచ్చు.

'ఒరే చెలమయ్యా. నీకేరా—అదురుష్టవంతుడివి. ఒంటరి పచ్చివి! నే చెప్పేదేటంటే—ఒకళ్ళకోసం నువ్వేడవక్కర్లేదు. ఊరుమీదబడి ఒళ్లొంచక్కర్లేకుండా పొద్దునకాడికి తింటావు —మెట్లమీద అయినా తొంగుటావు, నీకేరా—సుబ్బరమైన బతుకు.' అని తాతయ్యమూర్తి అప్పుడప్పుడు తన గుండెని ప్రదర్శిస్తూ వుంటాడు. చలమయ్య చిన్నగా నవ్వేసి ఊరుకుంటాడు.

* * *

'ఊహ్...' అంటూ, ఆ మాటకి అడ్డం చెప్పు వేదని మాటాడ్డం వద్దన్నట్టు చెయ్యి చూపించి, ముఖాన్ని వేదాంతమయం చేసుకొన్నాడు తాతయ్యమూర్తి. సరిగ్గా అప్పుడే ఫకీరు కొట్టుదగ్గిరికి చుట్ట ముట్టించుకోడానికి వచ్చాడు చలమయ్య.

'నే చెప్పేదేటంటే...ఆయాల నేనుగానక్కడ లేకపోయానా అంటే ఆ దొరగారి గుర్రం, ఆయన్ని కిందపడేసి తొక్కి పచ్చడి చేసేది. ఈ ఊసొకి చెప్పు నువ్వేటి చెబుతావనుకొన్నావో.' అంటూ ముగించాడు తాతయ్యమూర్తి.

ఫకీరు మాట్లాడలేదు.

'ఫకీరు బాబా—అగ్గిపెట్టె వుంటే ఇయ్యండి' ఒక వారగా నిలబడి అడిగాడు చలమయ్య.

'ఇదిగో.' అంటూ తాతయ్యమూర్తే అగ్గిపెట్టె యిచ్చాడు. 'ఏరా చెలమయ్యా. ఈవేళ బాగా దొరికిందా? మా ఫకీరూ పిల్లాడు!... ఒరే చెలమయ్యా—రేపో మాపో చచ్చేవాడివి కదా ఉన్ననాళ్లూ కాస్త హాయిగా బతక్కూడదట్రా? ఆ పళ్లు పంచి, ఆ తుండుగుడ్డ అవతల పారేసి—కొత్త పంచె, బనీను సుద్దా కొనుక్కోకూడదూ?' తాతయ్యమూర్తి అడిగాడు.

'ఏటో బాబా — నాకు మంచి చెడ్డ

లేందుకా అడుక్కునేవోణ్ణి. బినా బతకేడానికే బట్ట సాల్దంటారేటి!' చిర్నవ్వుతో అన్నాడు చలమయ్య.

'చాల్లా—గోచీగుడ్డైనా చాలు. ఐతే ఈ డబ్బంతా కూడబెట్టి ఏమిచేస్తావ్? ఒంటరి పచ్చివి!'

'నా దగ్గరేటుంది బాబూ మీరట్టా గమకోటవేఁగాని? నా కెక్కువున్నాది ఆడికీ ఈవాడికీ యిస్తానే వున్నాను.'

'నీకేరా — నిచ్చేపంలా గున్నావు!' అమాయగా చూస్తూ గట్టిగా నవ్వాడు తాంయ్యమూర్తి.

చలమయ్య మామూలుగా చిరునవ్వాడు.

* * *

ఉపవాసాలు చేసిన భక్తుల్లాగ అక్కడొకటి అక్కడొకటి వీధిదీపాలు వెలుగుతున్నాయి. ఆంజనేయస్వామి గుడి తలుపులు మూసేసి రాత్రి ఎనిమిది గంటలకే పూజారి వెళ్లిపోయాడు.

అర్ధరాత్రి — భయంకరంగా ఆవులిస్తూంది. గుడిమెట్లమీద చీకట్లు గుసగుసలాడుకొంటున్నాయి. చలమయ్య, మెట్లమీద నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

నిద్రపోతున్న చలమయ్యని — ఏవో కేకలూ, మాటలూ మేల్కొలిపాయి. లేచి కూర్చున్నాడు. అంతటా నిశ్శబ్దంగా కనిపించింది. చిటికలువేసి ఆవులిస్తూ టైముకోసం నక్షత్రాలవెంపు చూశాడు.

'ఎక్కడికిపోతావే గుంటా? మర

# ముళ్లపొదల మధ్య...

చేతిలో పడితే జారిపోడం వుత్తదే. రా. మరియాదగా నా మాటిను.' ఎవరిదో మగగొంతు నిశ్శబ్దాన్ని బద్దలు చేసింది, అస్పష్టంగా.

'ఛీ—వొదులు, వొదులు.' అనే ఆడగొంతు, దానితోపాటు విసురుగా గాజుల చప్పుడు.

ఆ మాటలు గుడి వెనుకనుంచే వస్తున్నాయని చలమయ్యకి తెలిసింది. పరిస్థితి క్షణంలో అతనికి అర్థమైంది—

'ఎక్కడికి పోతావేం? నిన్ను రక్షించడానికిక్కడెవరూ లేరు. రా...రా.'

'వొదుల్తావా లేదా—వొదులు—ఛీ.'

'ఎవడ్రా వాడు?' గట్టిగా అరిచి, కర్ర తాటించుకొంటూ చలమయ్య వేగంగా సందులోకి వెళ్లాడు.

కనీడలో పెనుగులాడుతూ రెండు ఆకారాలు నీడల్లా కనిపించాయి.

'కాపాడండి. నన్ను కాపాడండి ... ఛీ. వొదులు.'

'వొదల్రా—వొదలెహె.' రెండు చేతులతోనూ కర్రపట్టుకుని గట్టిగా నేలమీద రెండుసార్లు కొట్టాడు చలమయ్య.

ఒక్క క్షణంలో ఒక ఆకారం అదుర్దాగా రోడ్డుమీదికి పరిగెత్తింది.

'ఆగు. ఆగరా, ఆగెహె.' అంటూ వెంటబడిన చలమయ్య విసురుగా కర్ర విసిరాడు.

కర్ర తగిలింది కాబోలు—'బాబోయ్' అంటూ ఆ ఆకారం రోడ్డుమీద మాయమైంది.

'యెదవలు — యెదవలని. మడుసులు కాళ్లీరు పశువులుగాని.' పారిపోయిన మనిషితో పాటు పరిగెత్తే ఓపికలేని చలమయ్య నిలబడే తన కోపాన్ని ప్రదర్శించాడు.

'సమయానికి మీరు రాంపోతే నాబతుకు నాశనమై పోను: దేవుడిలా వచ్చారు.' స్త్రీ కంఠం కృతజ్ఞతలు కురిపించింది.

'దాందేముంది లేమ్మా. ఎవరు మీరు? ఇంతర్ద రేత్తిరేళ ఒంటరిగా ఎక్కణ్ణుంచొస్తున్నారు'' ఆమెను సమీపించి అడిగాడు చలమయ్య.

'ఏం చెప్పమంటావురే. ఈ ఊళ్లో మా అక్కయ్య వుంది. ఒకసారి చూసిపోదాం గదాని ఉదయం బయలుదేరాను. పొయ్యంత్రాని కల్లా ఇక్కడుండాల్సిన రైలు అర్ధరాత్రికి గాని చేరలేదు. ఎక్కడా రిక్షాలు దొరకలేదు. నడిచే వొస్తున్నాను. దారిలో వాడు నావెంటబడ్డాడు. మీరు రాంపోతే నేను తప్పించుకోలేక పోయేదాన్ని. మీకు నా కృతజ్ఞతలు...'

'ఓస్ — ఈ పాటి దానికే నేనేంటేంటమ్మా. ఊఁ. సరే పదండి — మీకు తోడుగా వస్తాను.'

ఇద్దరూ మాట్లాడుకుంటూ సాయిబాబా గుడివెంపు నడక సాగించారు.


'ఏటోనమ్మా—ఈ యెదవలకి శరీరం వొంకటే ముక్కెమై పోయింది. మనసుకీ మంచితనానికీ యిలవ లేకుండా పోతుంది.' చేతికర్ర ఆడుచేస్తుండగా చలమయ్య అన్నాడు. అతని కళ్లలో ఏదో అనిర్వచనీయమైన బాధ గూడు కట్టుకుంది.

'కొన్నాళ్లకి ఈ పెపంచం ఏటవుతుందో తెలవదమ్మా. మడిసికీ 'జంతువుకీ లేదా సన్నిపోతుంది.' చలమయ్య గుండెల్లో తిరుగుతున్న విచారం గొంతులో పలికింది.

ఇద్దరూ నడుస్తున్నారు.

* * *

మధ్యాహ్నం పన్నెండుగంటల తరు



కాయిదా చెల్లింపు పద్ధతిన నెలకు
రు. 10 కట్టి ట్రాన్‌సిస్టర్ పొందండి!




"నేషనల్ 70" సరికొత్త జపాన్ మాడల్ ఆకర్ష
ణీయమైనది, శక్తి గలది. దయల్ లైటుగల
ఆల్‌వరల్డ్ 3 బ్యాండ్ ట్రాన్‌సిస్టర్. ప్రతి
గ్రామానికి పట్టణానికి పంపగలం. తెలుపవలెను.

WRITE YOUR LETTER TODAY
MUSIC E SOUND (N)
P BOX 1576, DELHI-6

కావలెను

నెలకు రు. 650 జీతము లేక చక్కని
కమీషన్ పద్ధతిమీద జపాన్ ఆర్ట్ సిల్కు చీరెలు,
టెరిలిన్ సూటింగులు, రెడీమేడ్ ఉడుపులు,
నైలాన్ షర్ట్సు, ట్రైన్ వగైరాలకు ఆర్డరు
పొందుటకు సేల్సుమెన్ కావలెను. కాంపి
ల్సుకు వెంటనే వ్రాయ గోరడమైనది.
ARVIND AGENCIES (5)
Post Box 1408. Delhi-6.

దీర్ఘ రోగులకు
ఉత్తమ వైద్యము



నపుంసకత్వము, శుక్ల నష్టము,
హస్తప్రయోగము, అసంతృప్తి,
ఉబ్బసము, (దమ్ము) బోదకాళ్లు, చెవుడు,
కడుపునొప్పి, కుష్ఠు, బొల్లి, చర్మవ్యాధులకు
పోస్టుద్వారా కూడా వైద్యము చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల,
డా॥ పి. కుమారస్వామి దేవర,
ట్రావెలర్స్ బంగళా రోడ్, తెనాలి.

ఎలెక్ట్రిక్ & రేడియో
ఇంజనీరింగ్ కోర్సు

ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపే
రింగ్, అసెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ మోటర్
మెషినరీ, వైరింగ్ వగైరాలకు సమగ్రమైన
గైడ్ (800 బొమ్మలు గలది).
రు. 12-50. వి. పి. పోస్టేజి రు. 2.

M. CHANDRAS (E)
Box No. 1271. Delhi 6.

## వుల్లపొపల వద్ద..

వాత గాని తీరిక దొరకని చలమయ్య— మామూలు వేళకే గుడిదగ్గర చేరాడు. తన పని ముగించుకుని నెమ్మదిగా ఫకీరు కొట్టు దగ్గిరికి అగ్గిపెట్టెకోసం వచ్చాడు.

కొట్లో ఫకీరొక్కడే వున్నాడు ఎవరిదో లాల్చీ కత్తిరించు కుంటున్నాడు.

'ఏరా చెలమయ్యా— అగ్గిపెట్టా? ఇంద.' అంటూ అగ్గిపెట్టె తీసి ఇచ్చాడు ఫకీరు. 'ఊఁ. అలా అరుగుమీద కూచో.' అన్నాడు.

'ఏటి పకీరుబాబూ తలకి కట్టు కట్టేరేం? ఏటయింది?' చుట్ట ముట్టించుకుంటూ అడిగాడు చలమయ్య.

'కట్టా? ఇదీ...ఇదంతా పేద్ద కథ లేరా.' అన్నాడు. ఎందుకో నవ్వాడు ఫకీరు.

'సెప్పండి—ఎట్టా తగిలింది?'

'చెప్మంటావ్? సరే. మా యింట్లో ఒక నేరేడుచెట్టు వుంది. అది ఆకాశాన్నంటుతూంది. దానికాస్త దూరంలో చాలోజుల క్రితం ఒక దొండపాదు పెట్టాన్రా. వెధవది ఆ పాదు పాకి పాకి చివరకి నేరేడు చెట్టెక్కింది. ఎక్కి చెట్టునిండా అల్లివేసింది. కాయలు కోసుకోవాలంటే నేరేడు చెట్టెక్కాల్సి వస్తోంది. నిన్న సాయంత్రం మా యింటికి ఓ చుట్టమొచ్చాడు. కూర ఏదీ లేకపోతే బావుంటుందా నువ్వే చెప్పు? చెట్టెక్కాను. కాయలు కోస్తున్నాను. ఒకచోట నాలుగు పొట్లకాయల్లాటి కాయలు కనబడ్డాయి. మన కంట్లో పడితే జారిపోవడం కల్లోమాట! ఎలాగైనా వాటిని కొయ్యాలని ఆ సన్నపాటి కొమ్మమీదికి జరిగాను. అంతే—కొమ్మవిరిగి, కాలుజారి కిందపడ్డాను. ఇంకా నయం బుర్ర కన్నం పడ్డంతో సరిపోయింది — ఏ చెయ్యో విరిగితే ఏమౌనంటావ్?'

ఫకీరు చెప్పడం ముగించి, సాహసకృత్యం చేసిన ధీరుడిలా చూస్తూ నవ్వాడు. ఇంకా అతని కళ్లల్లోంచి అవ్యక్తమైన భావాలేవో తొంగి తొంగి చూస్తున్నాయి.

'చొ చ్చొ చ్చొ ... ఎంత పన్జరిగింది పకీరుబాబూ. పోన్లె — అక్కడికి అదురున్టవొంతులే. ఏ చెయ్యో యిరిగితే బతుకే పాడవ్వును.' సానుభూతి చూపించాడు చలమయ్య.

ఇంతలో తాతయ్యమూర్తి వచ్చాడు, పావుకోళ్లకంటే ఎత్తుగావున్న తోలు చెప్పులు టకటక లాడించుకుంటూ.

'ఏటది? నేరేడుసెట్టుమీది దొండ కాయిలకతేనా? చెలమయ్యా — చూద్రా మన పకీరు ఎంత గొప్పవాడో! అంత ఎత్తునించి పడ్డా ప్రాణం పోలేదు! ఎంత గట్టోడో! పకీరూ — నీకు తెలవదుగానీ సావు తప్పి కన్ను లొట్టోడవంటే ఇదే' అంటూ తన మామూలు ఆసనం మీద కూచున్నాడు. 'ఆఁ. ఏం చెలమయ్యా— ఇంకేవిటి విశేషాలు?' తాపీగా చుట్ట వెలిగించుకుంటూ అడిగాడు.

'ఇసేసా లేవున్నాయి బాబూ— రోజూ సూత్తన్నాయేగా! సీకటి తప్పల్ని మడిసి లడ్డూల్లా తినేస్తన్నాడు. రేత్తిరి వో బాగోతం జరిగింది. బెమ్మసారి అను మంతులోరి గుడికాడే ఆడెవడో యెదవ, యవ్వారం మొదలెట్టాడు. సీకట్లొ ఆ డెవడో తెలిసిందిగాదు — వాయాల సంపే సుండోవాణ్ని...' అంటూ ప్రారంభించి రాత్రి జరిగిన విషయం క్లుప్తంగా వివరించాడు.

'అహ్ అహ్ హహ్హ!' అంటూ గట్టిగా నవ్వాడు తాతయ్యమూర్తి. 'నువ్వు రావులోరి కాలంలో వుండాల్సినవాడివిరా చెలమయ్యా. ఆ డెవడో ఎవత్తినో ఇరకాటంలో పెట్టాడని నువ్వెందుకురా మధ్దిలో దూరడం? ఆళ్ల పాట్లేవో ఆళ్లు పడతారు నీకెందుకురా బాద? నే చెప్పేదేటంటే — అలాటి పాత మిరపకాయ నీతులన్నీ ఎంగావేళ పోయాయిరా. నీకు తెలీదుగానీ పారిన్లో చూడు. ఆళ్లకిలాంటి తప్పలేం లేవు. దొరికిందల్లా తినెయ్యడమే. నువ్వు తిండం లేదూ?'

చలమయ్య మాట్లాడలేదు. చిర్నవ్వుతో ఉండిపోయాడు.

'గురూగారూ — కోప్పడకండి చిన్నమాట' కత్తిరింపు అపుచేసి పకీరు అన్నాడు.

'చెప్పు చెప్పు.'

'మీరన్నది — ఇద్దరూ యిష్టపడితే బాగానే వుంటుంది గాని — చూశారా — పాపం, రాత్రి ఆ ఆడకూతురలా గోల పెడుతూంటే, వాడెవడో ఇచ్చా అలా... అప్పే నాకేం నచ్చలేదు సుమండి.'

'అదిగాదు ఫకీరూ — నే చెప్పేదేటంటే...' అంటూ మొదలుపెట్టి తాతయ్యమూర్తి మరోసారి పొడవుగా ఉపన్యసించాడు.

ఫకీరుకి నచ్చలేదు.

ఇద్దరూ వాదులాడుకుంటున్నారు.

వాళ్ళ వాదోపవాదాలు వింటూ చలమయ్య చుట్ట పీల్చుకొంటూ చిర్నవ్వుతో కూర్చుండిపోయాడు. 'విచిత్రమైన మనుషులు' అనుకుంటున్నాడు.

* * *

సాయంత్రం—నిస్సత్తువగా రాత్రిలోకి జారుతూంది. చలమయ్య, మెట్లమీద కూచుని నిశ్శబ్దంగా పెరిగిపోతున్న చీకట్లలోకి చూస్తున్నాడు.

ఎప్పుడో వచ్చి, దీపం వెలిగించి వెళ్ళే పూజారి ఆరోజున రాలేదు.

బాగా చీకటి పడింది. టీ తాగడానికి చలమయ్య లేచాడు.

'చెలమయ్యా—చెలమయ్యా' అంటూ ఫకీరు హడావుడిగా అక్కడికి వచ్చాడు.

'ఏం ఫకీరుబాబూ ఏటడావుడి? తయ్యారై కొట్టు పెంపుగదా — సాపొద్దె యొచ్చారేం?'

'ఏం లేదు చెలమయ్యా. ఈ వేళ పొద్దుట మా పెద్దమ్మాయి పెద్దమనిషైంది. అంచాత...' అంటూ జేబులోంచి ఒక పొట్లాం పైకి తీశాడు. ఐదు క్షణాలు ఎందుకో తటపటాయించాడు. 'ఇదిగో, నోరు తీపి చేసుకో' అంటూ పొట్లాం చలమయ్య చేతిలో వుంచాడు.

'నాకెందుకు బాబూ' అంటూ చిరునవ్వుతో అందుకున్నాడు చలమయ్య.

'వస్తానురా ఇంకా చాలామందిని కలుసుకోవాలి. పొద్దుట్నించీ ఖాళీ లేదనుకో' అని ఫకీరు త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

ఒక నిముషం తరువాత — 'ఏటో మొరిపెడికి', అనుకుంటూ చేతిలోవున్న పొట్లాం విప్పాడు చలమయ్య. అందులో నాలుగు కొబ్బరి పుండలున్నాయి. అలాంటి వస్తువు తిని ఎన్నో సంవత్సరాలు గడిచిన చలమయ్యకి నోరూరింది. మెట్లమీద కూచుని, కళ్ళకద్దుకుని వాటిని తినేశాడు. లోలోపల మెచ్చుకున్నాడు.

హోటల్లోకి వెళ్ళి టీ తాగి వచ్చాడు చలమయ్య. మామూలుగా మెట్లమీద పడుకున్నాడు.

చల్లటిగాలి హాయిగా వీచుతూంది. దైవధ్యానం చేసుకుంటూ పడుకున్న చలమయ్యకి కొద్ది సేపటిలో నిద్ర పట్టేసింది.

* * *

తెల్లవారింది. ఎనిమిది గంటలైంది.

తాతయ్యమూర్తి, వెల్లుల్లిపాయ, ఫకీరు వగైరాలు కాక యింకా కొంత మంది గుడిమెట్లముందు గుమిగూడి వున్నారు. అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం, విచారం నిండివుంది.

'నిన్న సాయంత్రం నిక్షేపంలా గున్నాడు — ఇంతలోనే ఏవొచ్చిందంటావ్? అంతేలే — వాళ్ళు చెప్పేరాసు ఫకీరూ' తాతయ్యమూర్తి గొంతులో విచారం పలికింది.

ఫకీరు మాట్లాడలేదు. చలమయ్య ముఖంలోకి విచిత్రంగా చూస్తున్నాడు.

అందరి కళ్ళు — ముకిలిపెట్టుకుని కదలిక లేకుండా మెట్లమీద పడుకున్న చలమయ్యమీద కదులుతున్నాయి. ఊసులతో మాట్లాడుకుంటున్నాయి.

ఒక వ్యక్తి, చలమయ్య మొలలో ఉన్న డబ్బుతీసి తాతయ్యమూర్తి చేతికిచ్చాడు.

'ఇరవైరూపాయల ఇరవై పైసలు' అందరి ఎదురుగా లెక్కపెట్టి అన్నాడు తాతయ్యమూర్తి.

సూర్యకాంతం, కన్నీళ్ళు తుడుచుకుంటూ హోటల్లోకి వెళ్ళిపోయింది.

* * *

చలమయ్యకి నా అనేవాళ్ళెవరూ లేరు గనక అతని హఠాన్మరణంమీద ఏ పరిశోధనలూ జరగలేదు. మునిసిపాలిటీ బండి, అతని శవాన్ని మెట్లమీద లేకుండా చెయ్యగలిగింది.

తన దగ్గిర చలమయ్య దాచుకున్న బియ్యం, అతని పేరుమీద బీదలందరికీ పంచిపెట్టింది సూర్యకాంతం.

'ప్చ్ — పాపం — చాలా మంచివాడు చెలమయ్య' అనుకుంటూ ఫకీరు నిట్టూరుస్తున్నాడు. చలమయ్య మరణం వల్ల అతను చాలా క్రుంగిపోయాడు. గుడి మెట్లమీద చలమయ్య, కూచున్నట్లే అతనికి కనిపిస్తున్నాడు. విచిత్రమైన భీతి, అతని గుండెల్ని కరిగించి వేస్తూంది.

'ఫకీరుబాబూ — లగ్గిపెట్టో పాలి య్యాండి' చలమయ్య గొంతు వినిపించి, శూన్యంలోకి చూస్తున్న ఫకీరు ఇటు వైపు తిరిగాడు. అక్కడ ఎవ్వరూ లేరు!

గుడిమెట్లు, రావిచెట్టు—ఆడె అరని కళ్ళలో తిరిగిరాని చలమయ్యకోసం దీనంగా వెతుక్కుంటున్నాయి. ●

